క్లుప్తంగా

వైభవంగా మల్లేశ్వరునికి అభిషేకాలు





వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కార్తిక నక్షత్ర దీక్షా మహోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షణలు, పల్లకీసేవ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకారం చేశారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీదేవి అలంకారంలోని అమ్మవారికి త్రిశతి, ఖడ్గ మాల, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం పంచహారతులు అనంతరం చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం జరిగాయి. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

సేవతోనే జీవితానికి సార్థకత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి సేవ చేసినప్పుడే జీవితానికి సార్థకత కలుగుతుందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య అన్నారు. యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ అమెరికా నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న చిట్టూరి హైస్కూల్ అధ్యక్షుడు చిట్టూరి ఆనందరామసుధాకర్, కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న కేబీఎన్ కళాశాల ఉపాధ్యక్షుడు చిట్టూరి నాగేంద్రకుమార్ ఆత్మీయ అభినందన సత్కార సభ శుక్రవారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్లయ్య మాట్లాడుతూ ఆనంద్, నాగేంద్ర ఇద్దరూ తమ పెద్దల వారసత్వాన్ని అందిపుచ్చుకొని హిందూ హైస్కూల్స్ కమిటీ పక్షాన వేలాది మంది విద్యార్థులకు సేవ చేశారని కొనియాడారు. ఉన్నతమైన వ్యక్తిత్వం పటిష్టమైన ప్రణాళిక వారిద్దరిని వ్యాపార రంగంలోనూ, సేవా రంగంలోనూ ఉన్నత స్థానంలో నిలబెట్టాయన్నారు. కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆనంద్, నాగేంద్ర చేసిన నిర్విరామ సేవకు ప్రతిఫలంగా గౌరవ డాక్టరేట్ లభించిందన్నారు. కమిటీ కోశాధికారి బాబా విజయకుమార్, ఏవో డాక్టర్ వి. నారాయణరావు, కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణిలు పాల్గొన్నారు. కమిటీ పక్షాన ఆనంద్, నాగేంద్రలను సత్కరించారు.

విజయవాడ జోన్ ఆర్టీసీ ఈడీ గోపీనాథరెడ్డికి సత్కారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ పీటీడీ (ఆర్టీసీ) విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథరెడ్డి పదవీ విరమణ సందర్భంగా విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్, జోనల్ స్టోర్స్ సిబ్బంది ఆయనను శుక్రవారం సత్కరించారు. ఇది పదవీ విరమణ కాదని.. సర్వీస్‌లో ఎన్నో ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా వాటిని చిరునవ్వుతో స్వీకరిస్తూ కింది స్థాయి ఉద్యోగులను కలుపుకుపోతూ సంస్థ అభివృద్ధి కోసం నిబద్ధత, కార్యదీక్షతతో పని చేసిన గోపీనాథ్‌రెడ్డి భవిష్యత్ విశ్రాంత జీవనానికి నాంది అని పలువురు కొనియాడారు. సిబ్బంది చేసిన సత్కారానికి స్పందించిన గోపీనాథరెడ్డి మాట్లాడుతూ అధికారులు, కింది స్థాయి ఉద్యోగులు చెప్పే విషయాలను ముందుగా వినటం అలవాటు చేసుకోవాలని, ఆ తరువాత వాటి గురించి చర్చించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వర్క్స్ మేనేజర్ సత్యనారాయణ, సీఓఎస్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన సత్కార కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రవివర్మ, అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఈడీ విజయరత్నం, ఆర్ఎంలు విజయ గీతిక, నాగేంద్రప్రసాద్, సీసీఓఎస్ రాఘవ కుమార్, సీఈ శ్రీనివాసరావు, ఈఈ రాజశేఖర్, డెప్యూటీ సీఎంఈ లు విమల, నీలిమ, శ్రీరాములు, గద్దె నాగేశ్వరరా వు, చంద్రశేఖర్, ఎస్ఎమ్ఓ అమృతవల్లి, ఇతర అ ధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో లక్ష దీపోత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మహామండపం రాజగోపురం ఎదుట లక్ష దీపోత్సవాన్ని ఏర్పాటు చేయగా, ఆలయ డెప్యూటీ ఈవో రత్నరాజు అఖండ జ్యోతిని వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. కార్తిక మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

కానరాని స్వచ్ఛ సర్వేక్షణ్ !

- దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్‌లు, మూత్రశాలలు
- బహిరంగ మూత్ర విసర్జనతో తీవ్ర అపరిశుభ్రత
- టాయిలెట్‌ల నిర్వహణ చేపట్టాలని కోరుతున్న ప్రజలు



ఫ్రైజర్‌పేటలో నిర్వహణ లేక మూతబడిన నగర పాలక సంస్థ టాయిలెట్

వించిపేట(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి మెరుగైన ర్యాంకు సాధించే దిశగా పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామంటూ నగర పాలక సంస్థ అధికారులు ప్రచారాలతో ఊదరకొడుతున్నా ఆచరణలో కానరావడం లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో టాయిలెట్‌లు, మూత్రశాలల నిర్వహణను పట్టించుకోకపోవడంతో తీవ్ర దుర్గంధంతో అపరిశుభ్రత ఏర్పడింది. చిట్టినగర్, ఫ్రైజర్‌పేట, ఎర్రకట్ట రోడ్డు, వించిపేటలో గతంలో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన టాయిలెట్‌లు నేడు నిర్వహణ లోపం కారణంగా తీవ్ర దుర్గంధంతో అటుగా రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థలో మూత్రశాలలు, టాయిలెట్‌లు...

చిట్టినగర్‌లోని మట్టా లాజరస్ నగర పాలక సంస్థ పాఠశాల, ఫ్రైజర్‌పేట మోటూరి హనుమంతరావు పాఠశాలకు ఆనుకొని ఏర్పాటు చేసిన మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో నీటి సరఫరా పైపులు పగిలిపోవడం, నిర్వహణ పట్టించుకునే వారు లేకపోవడంతో అక్కడ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. దీని కారణంగా బాటసారులు, వాహనదారులు అత్యవసర పరిస్థితిలో పాఠశాల గోడ పక్కనే మూత్ర విసర్జనలు చేస్తున్నారు. దీంతో అక్కడ మరింత అపరిశుభ్రత నెలకొని ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన వ్యాపించడంతో విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చోలేకపోతున్నారు. అదే విధంగా నైజాంగేటు సెంటర్‌లోని ఎస్ఎన్ఎంసీ ఉర్దూ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన మూత్రశాలలు శిథిలమై కూలిపోవడంతో దాని పక్కనే డ్రెయిన్‌లో మూత్ర విసర్జనలు చేయడంతో అక్కడ కూడా విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఫ్రైజర్‌పేట బాప్టిస్ట్ చర్చి వద్ద గత రెండేళ్ల క్రితం లక్షల రూపాయల ఖర్చు చేసి కొండ ప్రాంత ప్రజలు, బాటసారుల కోసం ఏర్పాటు చేసిన టాయిలెట్‌లు నేడు నిరుపయోగంగా మారాయి. యూజ్ అండ్ పే పద్ధతిలో వాటి నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పిన నగర పాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాటిని వదిలేశారు. దీంతో వాటిలో నీటి సరఫరా, నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి.

మహిళల బాధలు వర్ణనాతీతం....

ఇళ్ల నుంచి కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థినులు, మహిళలు అత్యవస పరిస్థితిలో టాయిలెట్‌లు అందుబాటులో లేకపోవడం, ఒక వేళ ఉన్నా అధ్వానంగా తయారై లోపలికి అడుగు పెట్టలేని పరిస్థితి ఉండటంతో వారు పడే బాధలు చెప్పనలవికానివి. ముఖ్యంగా మహిళలు పలు కూడళ్లలో ఆటోలు, బస్సుల కోసం వేచి ఉండే సమయంలో అత్యవసరంగా మల, మూత్ర విసర్జనలకు వెళ్లాలంటే ఎటువంటి అవకాశం లేకపోవడంతో ఇళ్లకు వెళ్లే వరకు అసౌకర్యంగానే ఉండాల్సిన దుస్థితి ఉంది. వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో నగర పాలక సంస్థ అధికారులు టాయిలెట్‌లు ఏర్పాటు చేసి వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పలువురు మహిళలు కోరుతున్నారు.



చిట్టినగర్‌లో మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండటంతో బయటే మూత్ర విసర్జన చేస్తున్న దృశ్యం



మోటూరి హనుమంతరావు పాఠశాల వద్ద దుర్గంధభరితంగా మూత్రశాల

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సెక్షన్ పరిధిలోగల 11కేవీ ఐఎమ్‌పీ ఫీడర్ లైన్ మరమ్మతుల నిమిత్తం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పాలఫ్యాక్టరీ ఏరియా, సయ్యద్ అప్పల స్వామి కాలేజి వెనకాల కరెంట్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దుర్గామల్లేశ్వరస్వామికి విశేష పూజలు



స్వామి వారికి విశేష అలంకరణ



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీ హోమంతో పాటు శాంతి కల్యాణోత్సవంలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. మరో వైపున మల్లేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. ఘాట్‌రోడ్డు, మహా మండపం లిఫ్టు మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెటు క్యూలైన్లలో అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో క్యూలైన్లలో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కెఎస్.రామరావు, డెప్యూటీ ఈవో రత్నరాజు క్యూలైన్లను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగించగా, ఆలయ ప్రాంగణంలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆది దంపతులకు పూజలు అనంతరం దీపాలంకరణ సేవ జరిగింది. పలువురు ఉభయదాతలు, భక్తులతో పాటు ఆలయ ఈవో కెఎస్.రామరావు ఊంజల్ సేవలో పాల్గొన్నారు.



శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఊంజల్ సేవ

వైభవంగా కోటి దీపోత్సవం



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉభయదాతలు



రామలింగేశ్వర స్వామి వారికి విభూదితో అభిషేకం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం పురస్కరించుకుని భీమన వారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి సన్నిధిలో అభిషేకాలు, కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం రామలింగేశ్వరుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం విభూది, గంధంతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి దీపోత్సవంలో పాల్గొన్నారు. కార్తీక మాసం ముగింపును పురస్కరించుకుని డిసెంబర్ 1వ తేదీ ఆదివారం చండీ హోమం, స్వామి వారికి కుంభాభిషేకం, అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపుదలకు సైన్స్ ఎక్స్‌పో దోహదం



నమూనా మోడల్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు



శరీరంలో గుండె, లివర్ ఎలా పనిచేస్తాయో వివరిస్తున్న విద్యార్థిని

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని కేబీఎన్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. సెయింట్ జాన్స్ విద్యా సంస్థ వ్యవస్థాపకులు త్యాగరాజు సహాయం సతీమణి డాక్టర్ సుధ జయంతి సందర్భంగా భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన డాక్టర్ సుధ సైన్స్ క్వెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సైన్స్ క్వెస్ట్‌లో పునరుత్పత్తి శక్తి, పర్యావరణ పరిరక్షణ, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రీసైక్లింగ్ పాలిథిన్, సోలార్ పవర్ ఇరిగేషన్, యాంటీ ఎయిర్, వాటర్ పొల్యూషన్, వర్టికల్ కార్ పార్కింగ్ వంటి భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు సంబంధించి 400కుపైగా నమూనా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి సందర్శకులకు వాటి గురించి చక్కగా వివరించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రముఖ భారతీయ శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను తెలుసుకుని వారి స్ఫూర్తితో బాల శాస్త్రవేత్తలుగా ఎదిగి నూతన ఆవిష్కరణలను చేయాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన సెయింట్ జాన్స్ స్కూల్ సెక్రటరీ/కరస్పాండెంట్ టి. సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ ఈ సైన్స్ క్వెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన మోడల్స్‌లో వారి సృజనాత్మకత, శాస్త్రీయ నైపుణ్యాలు వెల్లివిరుస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ సుధ సైన్స్ క్వెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు కేబీఎన్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సీఈఓ రమా భారతి, ప్రిన్సిపాల్ కె.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ విజయవాడ డివిజన్ కార్యవర్గ సభ్యులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ) విజయవాడ డివిజన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే ఇనిస్టిట్యూట్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ నర్సింగ్‌రావు పాల్గొని ప్రసంగించారు. రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రైల్వే ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. యూపీఎస్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని, లోకో పైలట్‌లకు 46 గంటల వారం తపు సెలవులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ విజయవాడ డివిజన్, విజయవాడ బ్రాంచ్ నూతన కమిటీలని కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం...

ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ విజయవాడ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఎం.వెంకటేషన్, డివిజనల్ కార్యదర్శిగా ఆర్.వి రాముతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులతో పాటుగా ఏఐఎల్‌ఆర్‌ఎస్‌ఏ బ్రాంచ్ నూతన అధ్యక్షుడిగా ఎన్.ఎన్.వి రావు, బ్రాంచ్ సెక్రటరీగా బి.గౌరిప్రసాద్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్ట్ వర్కర్స్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఏఐఆర్‌ఎల్‌ఆర్‌ఎస్‌ఏ డివిజనల్ కార్యదర్శి కె.రామకృష్ణ, బిట్రగుంట, రాజమండ్రి, విజయవాడ డిపోల నుంచి 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం

విజయవాడ శ్రీధర్ సీసీఈలో ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో పేరిట శుక్రవారం ఏర్పాటు చేసిన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపుల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన మూడు రోజులు నిర్వహించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. మలేసియా 60వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద నోటు రింగిట్ మలేసియా(ఆర్ఎం 600) ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణంపై 145 దేశాలు ముద్రించిన 613 రకాల నాణేలు , వైల్డ్‌లైఫ్‌పై వివిధ సందర్భాల్లో 120 దేశాలు ముద్రించిన పలు రకాల నాణేలు వీక్షకులను కట్టిపడేస్తున్నాయి. వైల్డ్‌లైఫ్ విభాగంలో ఫ్లైయింగ్ ఫిష్ నాణేన్ని విద్యార్థులు ఫొటోలు తీసుకుంటున్నారు. ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సెంటెడ్ స్టాంపులు సువాసనతో అందరినీ ఆకర్షిస్తున్నాయి.

– గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/సాక్షి ఫొటోగ్రాఫర్



ఇంటర్‌నేషనల్ కాయిన్స్ ఎక్స్‌పోకు పోటెత్తిన విద్యార్థులు, యువతీ యువకులు



మలేసియాకు చెందిన అతిపెద్ద నోట్



సౌరకుటుంబానికి చెందిన గ్రహాల పేరు పై ఉన్న నాణేలు



భారతదేశ కరెన్సీ నోట్లు

కార్పొరేటర్లకు ల్యాప్‌ట్యాప్‌లు

వీఎంసీ కౌన్సిల్ తీర్మానం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలు కార్పొరేటర్లు సభలో చర్చించారు. నగరంలో నిత్యం ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య నిర్వహణతో పాటు పలు సమస్యలను మేయర్ రాయన భాగ్యలక్ష్మి చర్చించారు. కార్పొరేటర్ల ప్రశ్నలకు, ఎజెండాలో పొందుపరచిన అంశాలపై అధికారుల నుంచి సమాధానాలు రాబట్టి సభకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. అధికారులకు ప్రజలు, కార్పొరేటర్ల నుంచి వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య మరలా పునరావృత్తం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. వీఎంసీలో 2004 నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన సీపీఎస్ ఖాతాలో ఎంప్లాయిస్ షేర్‌వాటా సొమ్మును వారి ప్రాన్ ఖాతాకు జమచేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని సభ్యులు చేసిన ప్రతిపాదనపై కమిషనర్ స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని సాంకేతిక సమస్యలున్నాయని, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- వీఎంసీ నిర్వహణలోని స్కూళ్ల అభివృద్ధి మాత్రం అంతంతమాత్రంగా ఉందని... పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని వచ్చిన ప్రతిపాదనపై మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్పందిస్తూ గతంలో పాఠశాలల నిర్వహణను వీఎంసీ చూసేదని, కానీ నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అధనపు తరగతులు, మౌలిక వసతులు అన్నీ విద్యాసంస్థల నిర్వహణ విద్యా శాఖకు అప్పగించామని తెలిపారు. నాడు–నేడు అనంతర పరిణామాల నేపథ్యంలో స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనకు డీఈవోతో చర్చించి తర్వాత కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆమె సభలో సూచించారు.
- స్మార్ట్ గవర్నెన్స్‌లో భాగంగా పేపర్‌లెస్ అడ్మినిస్ట్రేషన్ అమలుకు వీఎంసీ కార్పొరేటర్లందరికీ ల్యాప్‌ట్యాప్‌లు అందించాలని అందుకు రూ.65.66 లక్షలు నిధులు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.
- నగరంలోని కృష్ణలంకలోని రాణిగారితోట ప్రాంతంలో నిరంతరం యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) సమస్య ఉత్పన్నమవుతుందని, ఈ ప్రాంతం నుంచి రామలింగేశ్వరనగర్ వరకు వెళ్లే యూజీడీ తరచూ మరమ్మతులకు గురవుతుందని, దీన్ని నియంత్రించేందుకు బైపాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కావటంలేదని కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి ప్రశ్నించటంతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో యూజీడీ సంప్ ఏర్పాటు చేసి మురుగునీటి పారుదలకు మోటర్లు ఏర్పాటు చేయాలని కౌన్సిల్లో తీర్మానించారు.

• ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్

విజయవాడలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్–2024 ఉత్సాహంగా కొనసాగుతోంది. పోలీసు సిబ్బంది ఎంతో చలాకీగా ఆటల్లో పాల్గొంటున్నారు. రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. మహిళా పోలీసులు మ్యూజికల్ చైర్స్‌లో పాల్గొన్నారు. క్రీడాకారుల కుటుంబసభ్యులు, స్నేహితులు, తోటి ఉద్యోగులు సందడి చేస్తూ ఆటలో పాల్గొన్న వారిని ఉత్సాహం పర్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







